వెలుతురు తెర

బొల్లోజు బాబా

కవిత్వం

వెలుతురు తెర
బొల్లోజు బాబా

వెలుతురు తెర

కవితలు

బొల్లోజు బాబా
9849320443

వెలుతురు తెర

- బొల్లోజు బాబా

జూన్ - 2016

వెల: రు. 100/-

కాపీల కొరకు:
బొల్లోజు బాబా
30-7-31
సూర్యనారాయణ పురం
కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్: 0884/2368189
9849320443

డిజైన్: ముమ్మిడి చిన్నారి

ముద్రణ: అభిసారిక ప్రెస్, సామర్లకోట

ఇందులో ...

తపస్సు	1
చరిత్ర	2
మార్పు	3
ఫ్రాగ్మెంట్స్	5
స్నేహం చెట్టు	7
వెలుతురు తెర	9
వస్తావా?	10
అసమానతలు	11
వృద్ధ జంట	12
ఫ్రాగ్మెంట్స్	14
పక్షి ప్రేమికులు	16
పిడిబాకు	18
ప్రార్థన	20
ఎందుకో తెలియటం లేదు...	22
నగరంలో చిరుత	24
కవిత్వం	26
ఎంతదృష్టం......	28
అదే గులాబీ.....	30
దేహమూ - నీడా	32
మధ్యాహ్నపు నిదురలో ఓ స్వప్నం	34
దొరికిన దొంగ	36
జీవితం	38
ఒంటరితనం	39
నువ్వు కాదు నేనే	40
ఫ్రాగ్మెంట్స్	42

మూడు సంసారాలు...	44
ఒక హిస్టరెక్టొమీ..	46
మూల్యాంకనం	48
సమతుల్యత	50
ఊడుపు	52
స్వప్నమునందు నిదురించువారు ధన్యులు	53
ఒక జ్ఞాపకం	55
కొన్ని పదాల గురించి......	57
చర్మం రంగు	59
విడిపోయింతరువాత........	61
అతిశయం	63
నీటిపొర	65
ప్రకృతి	67
ప్రశాంతత	68
నీకసలు స్వప్నించే అర్హత ఉందా.....	69
ఫ్రాగ్మెంట్స్	71
ఇల్లు	73
అల్పత్వము	74
మరణం	75
వీలుకాదని చెప్పించకు....	76
రెండు చింతలు	77
అమ్మ	78
అనావృష్టి	79
వెచ్చని కన్నీరు	80
దాహం	81
ఆదిమ వాక్యం	82
నాకు అర్థం కాదు	84

ప్రేమలేఖ	85
అధికారం	87
రక్తం మరకలు...	88
అపుత్రస్య.......	89
ఇంటికి తీసుకెళ్ళవా?	91
ఆ తరువాతేం జరిగిందంటే.....	92
రెండు నాల్కల పద్యం	94

మంచం నేసే చేతులు

"There is no Mountain of Sorrows
No ocean of griefs
There are only
Small hands
That Weave sorrow all day
Like a rope on a cot"

- Kedarnath Singh
Great Hindi Poet

బొల్లోజు బాబా – ఎవరీ బొల్లోజు బాబా? పి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ లెక్చరర్ గా పనిచేస్తున్న అధ్యాపకుడు. కవి, కవిత్వ సమీక్షకుడు – యానాం విమోచనోద్యమం గురించి పుస్తకం రాసిన, ఒక రకంగా చరిత్రకారుడు. ప్రతీ కవీ ఒక రకంగా 'చరిత్రకారుడే' తను జీవించిన కాలాన్ని–చరిత్రగా, సామాజిక చరిత్రగా మలచేవాడే. సూఫీకవుల్నీ, విశ్వకవి రవీంద్రుణ్ణి అనువదించిన వాడు. నెరుడా–యిరవై ప్రేమ కవితలు ఒక విషాదగీతం–అనువదించిన వాడు. యివన్నీ ఎందుకంటే బాబా Novice/కొత్తవాడు కాదు; సాహిత్య సాధనలో తలమునకలై ఉన్నాడు 'అని చెబటానికి. యానాం అనగానే శిఖామణి, దాట్ల రాజుగారు గుర్తుకు రాక మానరు. బాబా కాకినాడలో పనిచేస్తున్నా– అతని వేళ్ళు యానాంలో ఉన్నాయనిపిస్తుంది. యానాంకొక చరిత్రవుంది – ఒక ఉద్యమ సాంస్కృతిక చరిత్రవుంది. ఒక సాహిత్య చరిత్రవుంది.

బాబా పూర్వరంగమిది. సాహిత్య వారసత్వమిది; కాకినాడ అనగానే ఇస్మాయిల్‌గారు గుర్తుకురాక మానరు; అటు పిఠాపురం సోమసుందర శిఖరముంది. కోనసీమ సౌందర్యముంది; వీటంటి వెనక కృష్ణశాస్త్రి గారి 'ఊరకే చలియించు ఈ రేయివెన్నెలలున్నాయి'.

బొల్లోజు బాబా సాహిత్య రేఖా విలాసాలు అందాలను అందుకోవాలంటే, రేఖామాత్రంగానైనా యివి తెలియాలి. ఈ నేపథ్యాల నుంచి, సాహిత్య వారసత్వం నుంచి బాబా జీవించాడు కవిగా. 2009 లో అచ్చయిన అతని మొదటి కవితాసంపుటి – ఆకుపచ్చని తడిగీతం' లో సౌందర్యం అనే కవిత చూడండి.

'సెలయేటి ఎగువన ఎవరో
నీటిలో వెన్నెల బిందువుల్ని
కలిపారు.
నీరు తాగాలని వంగితే
దోసిట్లో చందమామ'

సూచ్యంగా, సూక్ష్మంగా బాబా తత్వాన్ని చెప్పే కవిత. ఆ సంపుటిలోనే 'అతడు–ఆమె' అనే కవితవుంది.

'అతడామెను
నడిచే చందమామ అనీ
పరచుకొన్న వెన్నెలనీ
నిలిచిపోయిన వసంతమనీ
వర్ణించాడు'

కవిత అలా సాగి సాగి

'ఎన్నో అన్నాడు
అతడామె గురించి చాలా చెప్పాడు–
కానీ ఆమె మాత్రం
ఒక చిరునవ్వు శాపమిచ్చి వెళ్ళిపోయింది
తెరచాటు మనిషి కదా!'

ఒక ముక్తాయింపు, ఒక ఆశ్చర్యపు వెలుగు–

చిరునవ్వు శాపమిచ్చి వెళ్ళిపోవటం' గొప్ప ఊహ–

అతని రెండో కవితా సంపుటి యిప్పుడు రాబోతుంది–"వెలుతురు తెర"–ఇంకేదయినా మంచి పేరు సూచించమనీ అడిగాడు. 'వెలుతురు తెర' బాగుంది. అతని మొదటి కవితా సంపుటికి గొప్ప పొడిగింపు– Beautiful Extension. వస్తు, రూపాల్లో ఒక Sophistication –ఒక నాగరీకం వచ్చింది. ఏ గుణాలయితే కవిత్వసంబంధి అంశాలో – యిందులో అవి పరిపక్వ దశకి చేరాయి. ఒక పరిణత కన్పించింది. వస్తువును సంభావించే తీరులో, దానికొక రూపమిచ్చే పనిలో గొప్ప నైపుణ్యం కన్పించింది. ఒక లాఘవం–ఒక వడుపూ అబ్బాయి–

మొదటి కవితా సంపుటిలో ఈ వాక్యాలు ఎదురవుతాయి–

'ఏదయినా ఓ పుస్తకంలోకి నడవటమంటే
పరిచిత పాత్రలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే'

ఈ కవితా వాక్యాల్ని కొద్దిగా మార్పులు చేస్తే, రెండో కవితా సంపుటికి అన్వయిస్తాయి.

ఏదయినా ఓ పుస్తకంలోకి నడవటమంటే
పరిచిత ప్రాంతాలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే–

యింకాస్త మార్చితే–

అపరిచిత ప్రాంతాలలోకి
పాత్రలలోకి
మనల్ని మనం ఒంపుకోవటమే!

పరిచయమయిన పాత్రగావచ్చు ప్రాంతం గావచ్చు – కవితలో కొత్తగా, మనం చూడని కోణం నుంచి పరిచయమవుతుంది.

షాహర్యార్ (Shahryar) అనే ప్రసిద్ధ ఉర్దూ కవి– ఒక గజల్ లో అంటాడు

The beauty of his verse
is not its meaning
Beauty of his poetry
is not always in its meaning – అని

బహుశ కవిత్వం మొత్తం వస్తువును భాషలోకి అనువదించటమే. ప్రతికవికి అతనిదయిన ప్రత్యేక భాష వుంటుంది. 'Conceiving the context into language' జీవితాంతం తన కవిత్వ పరిభాషనిర్మాణంలో కవి ధ్యానమగ్నుడై వుంటాడు. ఒక కవిని యింకొక కవినుంచి వేరు చేసేది – అతని కవిత్వ పరిభాషే. యిది అతని నేపథ్యం మీద, వర్గ కుల ప్రాంతాల ప్రభావం మీద ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా అతని దృష్టిమీద – attitude మీద perception మీద ఆధారపడి వుంటుంది.

ఈ సందర్భంలో నాకొకటన్పిస్తుంది. 'బొల్లోజు బాబా తెలంగాణలో పుట్టి పెరిగివుంటే; ఉత్తరాంధ్రలో పుట్టి పెరిగివుంటే ఎటువంటి కవిత్వం రాసివుండే వాడు' అని

ఖచ్చితంగా యిప్పటి కవిత్వానికి భిన్నమయిన పరిభాషలో రాసివుండే వాడు. కాళ్ళు గాలుతుంటే, వేడిగాలులు వీస్తుంటే, గుక్కనీరు దొరక్క అటమటించిపోతుంటే – తత్సంబంధమయిన వస్తుజాలంతో– నెత్తురంటిన కవిత్వ పరిభాషలో రాసి వుండేవాడని నేననుకొంటా –

ఇదంతా ఒక Guess Work

గత రెండుతరాల కవుల– ముఖ్యంగా ముప్ఫయ్యిలలో–నలభైల్లలో ఉన్న కవులు– కవిత్వం చాలా భిన్నమయింది. రొట్టకొట్టుడు లేదు. వస్తు నవ్యత, రూప నవ్యత గణనీయంగా పెరిగింది. వస్తువును చూడటం దగ్గరనుంచి, కోణం ఎన్నుకోవటం దగ్గరనుంచి–విప్పుకుంటూ పోయే విధానం దాకా కొత్తపోకడలు పోతున్నారు. భాష–యింత సౌందర్య వంతంగా, నాజూకుగా, లావణ్యంగా, లాఘవంగా గతంలో వాడబడిందా అని నాకన్పిస్తుంది. సంక్షోభ భరితమైన సందర్భంలో – ముఖ్యంగా గత రెండు దశాబ్దులుగా–కూడా, మొరటుదనం లేకుండా కనపడకుండా కవిత్వం రాయటం– ఈ నూత్న తరాలకవులు సాధించిన విజయమని నే భావిస్తున్నా– వారివారి తాత్విక నేపథ్యమేదయినా–వాదమేదయినా–కవితమీద కవిత్వరూపం మీద; భాషమీద, వ్యక్తీకరించే పద్ధతి మీద–ఇంతటి ధ్యాస మునుపెన్నడూ లేదనిపిస్తుంది

ఈ పుస్తకంలో 'చరిత్ర' అనే ఒక కవిత వుంది. కవిత మొత్తం ఉదహరిస్తా

చరిత్ర

"ఈ సొరంగం చివర
వెలుతురు ఉండి తీరాలి" అన్నాడతను

"ఒకప్పుడు ఉండేదట!
చెదలు తినేసాకా వెలుతురంతా
అయిపోయింది" అన్నారు కొంతమంది వృద్ధులు.

వెలుతురుని వెతుక్కుంటూ సాగిన ఆ యువకుడు
చెదపురుగులకు బలయ్యాడు.
ప్రజలు పడీ పడీ నవ్వుకొన్నారు
అయినవాళ్ళే మూర్ఖత్వమని
గుసగుసలాడుకొన్నారు చాలాకాలం.

కొన్నేళ్ళ తరువాత
వెలుతురు రాజ్యంలో, నగరం మధ్యలో
ఆ యువకుని విగ్రహం
"వెలుతుర్ని స్వప్నించిన సాహసి"
అనే అక్షరాలతో.

ఈ కవితలో ఎన్ని పొరలున్నాయో-అర్థ స్ఫూర్తులున్నాయో, రకరకాల పాఠకులు రకరకాలుగా వ్యాఖ్యానించటానికీ, ఎంత అవకాసముందో- కాల సందర్భాల్ని వస్తువుగా మార్చి - మూడు బొమ్మల ద్వారా/Images ద్వారా వ్యక్తపరచటం-

వ్యక్తమయిన భావం భాషగా-Image గా- భాష దృశ్యం భావ దృశ్యమై, దృశ్య సమ్మితమైన భాష వస్తువుగాను, దృక్పథంగానూ-తాత్విక సారాంశంగాను-వడకట్ట బడుతుంది.

ఈ నైపుణ్యం యిపుడు కొత్తగా కవిత్వం రాస్తున్న - 30, 40 ఏళ్ళ వయసులో వున్న వాళ్ళ కవిత్వంలో చాలా బలంగా చొచ్చుకొచ్చింది. బహుశ అందుకే ఈ కవులు 'Monotony' ని బ్రేక్ చేసారనిపిస్తుంది. కవిత మొత్తం ఒక అర్థవంతమయిన రూప నిర్మాణమవుతుంది- దాని వ్యక్తిత్వం, అభివ్యక్తులు దానికుంటాయి.

బహుశ ప్రతిదీ, సంక్షోభం కావొచ్చు, సౌందర్యం కావచ్చు అంతర్నిహితమౌతుంది, అంతర్గతమౌతుంది-Internalise అవుతుంది. కవితకి రెండు ఉనికులు లేవు. ఒకే ఉనికి. ఒకే రూపం, సౌందర్యం, సంక్షోభం - నిండిన రూపం పాఠకుణ్ణి పీల్చేస్తుంది. కవిత, తన్లోకి పాఠకుణ్ణి లాగేస్తుంది. కవిత ఉనికీ,జీవితమే - అతని ఉనికి, అతని అనుభవ జీవితం. ఇక్కడ ఈ రెండుతరాల కవులు ముందడుగు వేసారు. గతాన్ని, గతపు వారసత్వాన్ని స్వీకరిస్తూనే వాళ్ళదయిన ఒక కవిత్వ వ్యక్తిత్వం, కవిత్వ నిర్మాణం చేసుకుంటూ వస్తున్నారు.

కవిత్వం వాచ్యంగా రావటం మానేసి చానాళ్ళయింది. బడ బడ శబ్దాలు చేయటం మానేసి, గుండె గొంతుకలో కొట్లాడటం మొదలెట్టింది.

'కొన్ని పదాల గురించి' అనే కవితలో

'ఏమీ గుర్తు లేవిపుడు
జేబుడు సూర్యకిరణాలు
గుప్పెడు చందమామ
ముక్కలు తప్ప.

దుఃఖాశ్రువులు నిండిన
సాయంత్రాన్ని
రాత్రి రెప్పల క్రింద
నిదురపుచ్చి అన్నీ
మరచిపోదామనుకొంటాను
కానీ
కొన్ని పదాలు నా నుండి రాలిపడి
ఓ ఎడారిని సృష్టిస్తాయి
ఆ ఎడారిలోంచి ఓ అరణ్యం
ఆ అరణ్యం లోంచి కుంభవృష్టీ
ఒక్కొక్కటిగా విచ్చుకొని
నన్ను కబళిస్తాయి.
నానుంచి పుట్టినదైనా

నన్నే పూచికపుల్లను చేసి
కొట్టుకొని పోతుంది
ఏమీ గుర్తులేవిపుడు
జేబుడు పదాలు
గుప్పెడు కలల
ముక్కలు తప్ప

అంతా ధ్వనిపూర్వకమే - వచనం నుంచి కవిత్వాన్ని వేరు చేసేది 'ధ్వని' మాత్రమే. Suggestion కి అత్యంత ప్రాధాన్యత. పద్యం చదవటం ముగిసిన తర్వాత - 'ఎంత బాగా అన్నాడు, ఎంత బాగా ఊహించాడు- ఊహించిన దాన్ని ఎలా దృశ్యమానం చేశాడు - అదెలా మన అనుభవం చేశాడు - మన అనుభవం - కవిత్వానుభవంగా మారి అంచుల దాకా చేరి పొంగిపొర్లుతుంది - ఒక ఆహ్లాదం ఒక సంతృప్తి - కొత్త దాన్నేదో అందుకొని అనుభవించిన తృప్తి - లోలోపల కాంతిగా పరిణమిల్లుతుంది - అంతా వెలుగే.

ఈ కవితా సంపుటిలో లేనిదాన్ని గురించి నేనాలోచించను; డిమాండ్ చేయను; దాన్ని గురించి ఎందుకు రాయలేదు దీన్ని గురించి ఎందుకు రాయలేదు' అని నేనడగను; అతననుకున్న దాన్ని, అతని అనుభవంలోకి వచ్చిన దాన్ని; అదే సాంద్రతతో, తీవ్రతతో మన కందించాడా లేదా అన్నదే ముఖ్యం. ఆ పని బాబా చాలా సమర్ధవంతంగా, సంతృప్తికరంగా నిర్వహించాడని నేననుకుంటా -

ఇంకా తను భారతీయ కవిత్వానికి ప్రపంచ కవిత్వానికి Expose కావలసివుంది. ప్రపంచ భాషల్లో వస్తున్న కవిత్వం - ఆయా దేశకాల పరిస్థితులలో- ఎంతగొప్పది. ఒక్కో కవి ఒక్కో అంశం చెపుతాడు. పద్మవ్యూహం నుంచి బయటపడే మార్గం చూయిస్తాడు. నువ్వెంతగా యితరుల కవిత్వాన్ని లోతుగా చదువుతావు - జీర్ణ చేసుకొంటావు - రక్తనిష్టం చేసుకొంటావు అన్నదాన్ని బట్టే, నీ ఎదుగుదల, విస్తీర్ణత, విశాలత - ఒక కవిత విస్తృతమౌతూ - సార్వజనీనానుభవం ఎలా పరిణమిల్లుతుంది; అనే గొప్ప రహస్యాన్ని యితర కవులే బోధించగలరు.

మన వేళ్ళ నుంచి-మన జీవితం నుంచి, మన ప్రపంచం నుంచి మన అన్నిరకాల నేపథ్యాల నుంచి- మనం కవిత్వం పలుకుతాం - మన అనుభవాల్నుంచి,

దేన్ని ఏరుకుని కవిత్వం చేయగలం, గొప్ప కవిత్వం చేయగలం – అనే ఒక కవిత్వమార్మిక సూత్రాన్ని యితరులనుంచే గ్రహించగలం.

అంతా వివరాలతో విస్తృతమౌతుంది. రోజుకోరకంగా రూపు దిద్దుకొంటున్న జీవితాన్ని దాని సర్వసారాంశంతో పట్టుకొని – కవిత్వం చేయటం – లోతయిన అధ్యయనం, నిత్య సాధన ద్వారానే సాధ్యమవుతుందని – బాబా ఈ పాటికి గుర్తించివుంటాడు. గొప్ప Sensibility వుంది, గొప్ప చూపు ఉంది, జీవితాన్ని ప్రకృతిని చూసి పరవశించే గుణముంది – మొద్దు బారనితనముంది; మొగలిపొదలా నిలబడే తత్వముంది–

అది శిఖామణి కావొచ్చు, శ్రీకాంతశర్మ కావొచ్చు– ఒక లోతయిన తాత్విక కోణంలో కవిత్వం రాస్తూ– (రాజకీయం కాని తాత్వికకోణం లేదు) 'కాలుష్యమంటని కవి, కవిత్వం' అనటం–బాధాకరం–నాకీ మాట బూతుమాటగా ధ్వనిస్తుంది – అంతా కల్మషమయిన జీవితంలో, ప్రపంచంలో అకల్మషమేముంటుంది.

వీటన్నింటినీ అంతర్లీనం చేసుకొని గొప్ప కవిత్వం చెప్పగల సత్తా నీలో ఉ ండాలి. ఆ సత్తా ఎలా సమకూర్చుకోవాలన్నది ముఖ్యం. బహుశ దీర్ఘకాలికంగా కవిత్వ సాధన చేస్తూ వస్తున్న వాళ్ళకి – ఏ వాదపు నేపథ్యం నుంచైనా – ఇవన్నీ అందుతాయి, అనుభవంలోకి వస్తాయి.

గొప్ప కవిత్వం చదవండి;
గొప్ప కవిత్వం రాయండి–
మార్గాలన్వేషించండి–

బాబాని చదువుతుంటే చాలామంది గుర్తుకు రావొచ్చు–ఆ నీడలేవో లీలగా తారాట్లాడతాయి –అవన్నీ క్రమక్రమంగా తొలగిపోతాయి– నిజమయిన బొల్లోజు బాబానే మనముందు ప్రత్యక్ష్యమౌతాడు – ఆ ఆశ, ఆ వాగ్దానం యిందులో పుష్కలంగా వుంది.

దాహం

భూమిలోంచి పైకి లేచిన కుళాయి గొట్టం
ఒంపు తిరిగి పిట్టగోడను అనుసరిస్తూ సాగి
మరో రెండు మలుపులు తీస్కొని

ఇత్తడి టాప్ నేత్రమై
ఏ మేఘసందేశాన్నో నీళ్ళ భాషలో అందిస్తుంది

పుస్తకమూ అంతే
ఎన్నో మలుపులు తీసుకొని చేతిలోకి చేరి
ఒకనాటి మనో ఆకాశపు వానచినుకుల్ని
అక్షరాలుగా వర్షింపచేస్తుంది
మట్టి నయనాలపై

బొల్లోజు బాబా కవిత్వాన్ని గొప్పగా ఆనందించా, అనుభవించా. అతనొక తేనెపిట్ట– తేనెపిట్ట పువ్వుమీద వాలకుండా గాల్లో తేలుతూ తేనె పీల్చటం ఎంతగొప్ప విద్యో – ఆ దృశ్యం ఒక అనుభవం.

ఆ అనుభవాన్ని నాకిచ్చిన బాబాకి ధన్యవాదాలు

అతనికి శుభం జరగాలి

5/4/2016 **– కె.శివారెడ్డి**

కృతజ్ఞతలు

నా గురించి, నా కవిత్వం గురించి వ్రాసి - ఎంతో ప్రేమతో
ఆశీర్వదించిన శ్రీ కె. శివారెడ్డి గారికి

వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడుపుతూన్న నా
సాహితీగురువు శ్రీ శిఖామణి గారికి

ప్రేరణగా నిలిచి, స్ఫూర్తి నిచ్చే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి

అందమైన ముఖచిత్రాన్ని ఇచ్చిన బాల్య మిత్రుడు ముమ్మిడి చిన్నారికి-

ఇంకా - శ్రీ అఫ్సర్, శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్,
శ్రీ పి.ఆర్.ఎల్. స్వామి, శ్రీ యాకూబ్, శ్రీమతి విజయలక్ష్మి,
శ్రీమతి వీరలక్ష్మీదేవి, శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీఅవధానుల మణిబాబు,
శ్రీ గనార, శ్రీ చెల్లి రాం, శ్రీ మధునాపంతుల, శ్రీ గణేష్ కుమార్,
సంజీవ్, ఫణి, సారథి, ప్రభాకరరావు, శ్రీ అశోక్ కుమార్,
అంతర్జాలంలో నా రచనలను చదివి ప్రోత్సహించే మిత్రులందరకూ....

భవదీయుడు
బొల్లోజు బాబా

తపస్సు

చెట్ల ఆకులు
ధ్యాన ముద్రలో ఉన్నాయి
కొలను అలలు కూడా వాటిని
కలచ సాహసించటం లేదు
నీడ పొదలు నిశ్శబ్దంగా
తొంగిచూస్తున్నాయి.
పరిమళాల సంచారం
నిలచిపోయింది.

నిశ్చల దృశ్యానికి
ఓ రికామీ తెమ్మెర
చక్కిలిగిలి పెట్టిపోయింది

పూలు అంతవరకూ బంధించిన
సుగంధాలు రివ్వున ఎగిసాయి.
కొలను అలలలలుగా త్రుళ్లిపడింది.
నీడపొదల అల్లరి
మళ్లీ మొదలైంది.

ఆకులు గలగలా నవ్వేసాయి
ధ్యానం ఫలించినందుకు.

మే 17, 2010

చరిత్ర

"ఈ సొరంగం చివర
వెలుతురు ఉండి తీరాలి" అన్నాడతను
"ఒకప్పుడు ఉండేదట!
చెదలు తినేసాకా వెలుతురంతా
అయిపోయింది" అన్నారు కొంతమంది వృద్ధులు.

వెలుతురుని వెతుక్కుంటూ సాగిన ఆ యువకుడు
చెదపురుగులకు బలయ్యాడు.
ప్రజలు పడీ పడీ నవ్వుకొన్నారు
అయినవాళ్ళే మూర్ఖత్వమని
గుసగుసలాడుకొన్నారు చాలాకాలం.

కొన్నేళ్ళ తరువాత
వెలుతురు రాజ్యంలో, నగరం మధ్యలో
ఆ యువకుని విగ్రహం
"వెలుతుర్ని స్వప్నించిన సాహసి"
అనే అక్షరాలతో.

సెప్టెంబరు 28, 2015

మార్పు

ఆట్టే గొప్ప అందమనీ చెప్పలేనూ
చామనఛాయ, కోటేరు ముక్కు
పెద్దకళ్ళు, వయసు చెక్కిన దేహమూ అంతే

మా అందరి కోరికపై ఆమె
కాలేజి గార్డెన్ బెంచీపై బాచీమఠం వేసుకొని,
తలపైకెత్తి కనులు మూసుకొని గొంతునరాలు ఉబ్బిస్తో
ఎన్నిపాటలు వొంపిందో ఆ సాయింత్రపు చెవుల్లోకి.
ఆనాటి ఆ సాయింత్రం ఇప్పటికీ
మట్టిని మోసుకెళ్ళే కందిరీగలా నా దేహంలో
అదే పనిగా ఎగురుతూంటుంది గుర్తొచ్చినప్పుడల్లా.

శ్రావణశుక్రవారం పూట
చేతికి తోరం చుట్టుకొని, పట్టుపరికిణీ కట్టుకొని
సాంబ్రాణి వాసన చిమ్మే కురులతో, మెరిసే కాటుక కళ్ళతో
ఆమె నడచివచ్చిన అలనాటి ఆ దృశ్యం నేటికీ
జ్ఞాపకాల పేజీలమధ్య దాచుకొన్న
నెమలీక లాంటి చందమామ శకలం.

"బాయ్స్ అందరూ ఆ అమ్మాయికి క్షమాపణ
చెప్పేదాకా మేం క్లాసులకు వెళ్ళం సార్"
అని ప్రిన్సిపాల్‌కి తెగేసి చెప్పిన ఆమె తెగువ

కుర్రవాళ్లమైన మా అందరిగుండెల్లో స్త్రీల పట్ల
గౌరవ ద్వారాన్ని తెరచిన ఒకానొక సందర్భం.

ఫేర్‌వెల్ రోజున ఆమె పాడిన
“జగమేలే పరమాత్మా ఎవరితో..... పదాల్లో పలికిన
మార్దవం కోసం పాతికేళ్ళుగా వెతుకుతూనే ఉన్నాను.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అని పిలిస్తే
నే చదివిన కాలేజీకి వెళ్ళాను
చాలా కాలం తరువాత.

ఆమె కూడా వచ్చింది

మేం కలుసుకోకుండా ఉంటే ఎంత బాగుణ్ణు
అనిపిస్తోంది ఈమధ్య పదే పదే.

డిశెంబరు 8, 2015

ఫ్రాగ్మెంట్స్

1.
కవిత్వమనేది
ఆత్మలోకంలో ఇద్దరి సంభాషణ
అది
స్వగతమూ కాదు
ఊదరగొట్టే ఉపన్యాసం
అంతకంటే కాదు.

2.
క్రోటన్ మొక్కలు ఇంద్రధనుస్సుని
పగలగొట్టుకొని
పంచుకొన్నట్లున్నాయి
లేకపోతే
మొజాయిక్ గచ్చులా
ఇన్ని రంగులెలా వస్తాయి?

3.
పేడ పురుగులా
రోజూ పుట్టి చచ్చే సూరీడు.

తెల్లగా మెరిసిన కాంతిచర్మం
సంధ్యవేళ సమీపించే కొద్దీ
పొరలు పొరలుగా రాలి
నల్లగా కమిలిపోతుంది.

4.
యవ్వనంలో
నీ పంచేంద్రియాలలో
ఏదీ నిన్ను
పవిత్రంగా ఉంచలేదు.

5.
ఆమె
కనుల నీలిమలోకి
క్షణాలు
అదృశ్యమయ్యాయి.
దుఃఖ దృశ్యం
చిట్లి రాలినా
శీతల మేఘాలు
సంచరిస్తూనే ఉంటాయి.

6.
గాలిపటాన్ని
గద్ద తన్నుకుపోయింది
చేతిలో
తెగిన దారం మిగిలింది
జ్ఞానంలా

నవంబరు 22, 2015

స్నేహం చెట్టు

అపుడెపుడో సాయంత్రపు నడకలో చెరువు గట్టున
ముద్దులొలికే ఓ స్నేహం పిల్లను చూసాను

ఎవరో ఏ పరిచయాన్నో విత్తనం చేసి నాటి ఉంటారు
ఆకుపచ్చ ముక్కుతో మట్టిపొరల్ని పొడుచుకొని
బయటకు వచ్చి విప్పారిన పత్రాలతో లోకాన్ని చూసింది.

ముద్దులొలికే ఆ చిన్నారి స్నేహం పిల్ల
ఆకుల్ని రాల్చుకొనీ రాల్చుకొనీ , వేళ్ళని పాదుకొనీ పాదుకొనీ
స్నేహం చెట్టుగా ఎదిగిపోయింది ..... చూస్తుండగానే

ఎక్కడెక్కడి పక్షులో
ఎగురుకొంటో వచ్చి ఆ స్నేహం చెట్టుపై వాలేవి.
గూళ్ళు కట్టుకొని
తమని తాము పిల్లలు పిల్లలుగా బద్దలుకొట్టుకొని
ముక్కలన్నీ ఏరుకొని మళ్ళా ఎక్కడికో ఎగిరిపోయేవి.

చీకటయితే, బావురుపిల్లో లేక నీటిపాములో
స్నేహం చెట్టు మూలమూలలా వెతుక్కొని
కడుపునింపుకొనేవి.

ఆకుపచ్చ చీర కట్టుకొని
ఆకులవెనుక సూర్యబింబమంత ఎర్రని బొట్టుపెట్టుకొన్న
స్నేహం చెట్టుని చాలా సార్లు చూసాను నేను
ఇంకా రాయబడని అద్భుతగీతాన్ని వింటున్నట్టుండేది.

ఏదో ఒకరోజున
ఈ స్నేహం చెట్టు సైకత శిల్పంలా కూలిపోవచ్చు
అయినప్పటికీ
పచ్చగా, చల్లని నీడతో ఆహ్వానించే
ఈ స్నేహం చెట్టు నా జీవితాదర్శం.

నవంబరు 15, 2015

వెలుతురు తెర

చెట్టునీడలో కూర్చొన్న
విద్యార్ధుల గుంపు
వెలుతురు తెరలో దూకి
వైఫై సముద్రంలో తేలింది.

దారాన్ని స్రవించుకొని
కాళ్లతో పేనుకొంటూ తనచుట్టూ తానే
గూడు నిర్మించుకొనే పురుగులా
ప్రతీ విద్యార్ధీ తనచుట్టూ
ఓ మౌన పంజరాన్ని దిగేసుకొన్నాడు.

వైఫై లింక్ తెగింది
ఓహ్! షిట్.....

గూడులోంచి సీతాకోక చిలుక
మెత్త మెత్తగా బయటపడినట్లుగా
ఒక్కో విద్యార్ధీ మాటల ప్రపంచంలోకి
మెల మెల్లగా మేల్కొన్నాడు.
కాసేపటికి కాంపస్ అంతా
రంగు రంగుల మాటల చిలుకలు
రెక్కలల్లార్చుకొంటూ ఎగురుతో!

డిశెంబరు 19, 2015

వస్తావా?

చీకటి దుప్పట్లో దూరి
దేహ దీపాల్ని
వెలిగించుకొందాం

రాత్రి హార్మోనియంపై
మోహపరిమళాల రాగాల్ని పలికిద్దాం
శీతవేళకు చిక్కకుండా
వేడిశ్వాసల్ని కప్పుకొందాం

ఒక సమాంతర కాలంలోకి
అనంతంగా ప్రవహిద్దాం
వస్తావా!

డిశెంబరు 29, 2011

అసమానతలు

వేకువని
తలోముక్కా చక్కగా
పంచుకొన్నాయి పక్షులు
కిరణాల్ని
ఏ పేచీ లేకుండా పత్రాల సంచుల్తో
పంచుకొన్నాయి తరువులు

ఇంద్రధనుసుని
పొరలు పొరలుగా ఒలుచుకొని
పంచుకొన్నాయి పూలు

పూలనీ
పుప్పొడి గుప్పెళ్ళతో
పంచుకొన్నాయి తుమ్మెదలు

పంచుకోవటం
మనిషెప్పటికి నేర్చుకొంటాడు?

అక్టోబరు 8, 2015

వృద్ధ జంట

తేనెవానల్ని కురిపించిన
వెన్నెల రాత్రులు
అదృశ్యమయ్యాయి.

స్వర్ణ వాసనల్ని ఎగరేసిన
జాజులు నేలకొరిగాయి.
ఇంద్రధనుస్సులపై
స్వారీ చేసిన మహోద్రేకాలు
ఇక శలవన్నాయి.

నే పూయించిన
విజయాలు కరిగిపోయాయి.
నే సాగించిన
యుద్దాలు ముగిసిపోయాయి.
నే మొలిపించిన
స్వప్నాలు వెలిసిపోయాయి.

నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

ఈ దుర్బల దేహానికి
కాస్తంత

నమ్మికనివ్వటానికి
నా అనంత శయనాన
రవంత
కన్నీరు నించటానికి
నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

పెళ్లిచూపుల్లో
తలుపు సందులోంచి నన్ను చూసి
సన్నగా నవ్విన ఆనాటి
నువ్వు మాత్రమే మిగిలావు నాకు.

నవంబరు 17, 2009

ఫ్రాగ్మెంట్స్

1.
నేల సంకెళ్లను
నిత్యం తడుముకుంటూనే
వెలుగును తరుముకుంటూ
నీలాకాశంలోకి చొచ్చుకొని
పోతూంటాయి తరువులు.

చెట్టుని మించిన
వ్యక్తిత్వవికాస పుస్తకం ఏది?

2.
జీవితం అతని మోముపై
నర్తించి నర్తించి
అలసిపోయింది.
ఆ ముఖంపై ముడుతలన్నీ
దాని పాదముద్రలే.

3.
ఒక్క ప్రార్థనతో
ఈ గాజుపెంకులు
తొలగిపోతాయంటే
ఆత్మను కొవ్వొత్తిలా

మండించటానికి
నెనెప్పుడూ తయారే!

కానీ బెల్లు నొక్కితే
ఈశ్వరుడు ప్రత్యక్షమౌతాడా?

4.
అందరూ ఏదో ఒకనాడు
సూదిబెజ్జంలోంచి సాగాల్సిందే
వెలుగులోకో, చీకట్లోకో!

ఆ దినాంతాన
ఇచ్చిన వాటిని
పంచావా అంటే
ఏం చెప్పాలీ?

5.
తేనెటీగ కుట్టిన బాధలో
నాకు గుర్తుకే రాలేదు
కాసేపట్లో
అది చచ్చిపోతుందని.

6.
నీ నిష్క్రమణ
తరువాత రోజులన్నీ
ఒకేలా ఉన్నాయి.
మరోసారి
ఏడవటం తప్ప
మరేం చేయగలను చిన్నమ్మా!

జనవరి 24, 2010

పక్షి ప్రేమికులు

ప్రతీరోజూ అతను
తట్టనిండా కొంత దయను
మోసుకొని వచ్చి ప్లాట్ ఫార్మ్ పై పేర్చి
ఒక మూలగా కూర్చొని
దారిన పోయే వాళ్ళ కళ్ళలోకి
చూస్తుంటాడు.

దయంటే ఏమీ కాదూ
వాని జీవితంలోని కొంత భాగమూ,
కొన్ని చెమట చుక్కలు,
కాస్త పల్లెటూరి మట్టీ అంతే!
వాటిని తీసుకొని
సారెపై బుడగలా ఉబ్బించి, నిప్పుల్లో కాల్చి
తట్టలోకి ఎత్తుకొని పట్నం వచ్చి
ప్లాట్ ఫారం పై అమ్మకానికి పెడతాడు.

కరంటు తీగలమీద పక్షులు
ఆ పల్లెటూరి మట్టిని
విప్పారిన నేత్రాలతో చూస్తూంటాయి.

మట్టితో చేసిన ఆ పక్షిగూళ్ళను
ఎవరెవరో దయాళువులు
ఒక్కొక్కటిగా కొనుక్కుంటారు
ఇంటి బయట వేలాడదీయటానికి.

సాయింత్రానికి ఖాళీతట్టను
భుజానికి తగిలించుకొని
బయలుదేరేటపుడు
పక్షులు అతని తలపై తిరుగుతూ
అరుస్తూ, ఆనందంగా సాగనంపుతాయి.

అక్టోబరు 26, 2015

పిడిబాకు

ప్రశాంతతను
గాయపరచే పిడిబాకు
మళ్లా ప్రత్యక్షమైంది

దెబ్బకు స్వప్నం కాస్తా వాస్తవంగా
వాస్తవం కాస్తా మహా ఎడారిగా
మహా ఎడారి కాస్తా మృగతృష్ణగా
రంగులు మార్చేసాయి

ఆ నిర్జలోష్ణ కాసారపుటొడ్డున
రాళ్లు విసురుతో నా ఆత్మ

పిడి బాకు అంచున తృష్ణా బిందువు
పిడి బాకు అంచున మృగకాంక్షా శ్వాస
అచ్చోటనే రుధిర జాతర.
నరక సౌఖ్యం, స్వర్గ బాధ పెనవేసుకొన్న
సృష్టి సౌందర్య విస్ఫోటనం కూడా అక్కడే

తలుపు భళ్లున తెరచా
ఈ సమయంలో వచ్చావేమిటీ!
అందామె ఆశ్చర్యపడుతో

నెత్తురు నింపుకొన్న నా క్షణాల్ని
చూపించా!

గాయపడ్డ నా గీతాన్ని
తన దేహంలోకి తీసుకొని
స్వస్థ పరచిందామె ....ప్రేమతో....

ఏప్రెల్ 29, 2010

ప్రార్ధన

ఇప్పుడిక ఓ ఎడారిని ప్రసాదించు
వర్షించే ఇసుకా, ప్రవహించే ఎండా
దిగంతాలవరకూ
పరచుకొన్న ఏకాంతం
నిర్జల సరోవరాలతో కూడిన
ఓ ఎడారి కావాలిపుడు.

దానికేమాత్రం తగ్గినా
ఈ ఘడియ రక్తికట్టదు.

లేదా
ఓ సముద్రాన్నిప్పించు
దేహాన్ని తేల్చుతూ ఉండేంత ఉప్పని నీరు
చుట్టూ విశాలంగా విస్తరించిన ఏకాంతం
కింద వెచ్చని బడబాగ్ని
పైన చల్లని సుడిగాలులతో కూడిన
ఓ ఉప్పని సముద్రమైనా చాలు
సరిగా సరిపోతుంది.

లేక పోతే
ఓ రాత్రిని అనుగ్రహించు

అన్ని వైపుల్నుంచీ వీచే నల్లని గాలి
మువ్వలచేతికర్రతో సాగే నేత్రద్వయం
స్ఫటికం లా వణికే చిక్కని నీలిమా
పొదలమాటున మెరిసే కనుల ఏకాంతంతో కూడిన
ఓ రాత్రయినా చాలు సందర్భోచితంగా ఉంటుంది.

లేదా ....

జులై 14, 2010

ఎందుకో తెలియటం లేదు.........

ఎందుకో తెలియటం లేదు కానీ
ఆ వీధిలోంచి వెళ్ళాలనిపించటం లేదు.

ఆ గుడిసె ముందు ఆ ఆటోని చూసినప్పుడల్లా
యాక్సిడంటులో నుజ్జు నుజ్జయిన
ఆ ఆటోని చూసినప్పుడల్లా
పగిలిన దాని హెడ్ లైట్ నిస్తేజాన్ని చూసినప్పుడల్లా....

"అటెండెన్స్ సరిపోలేదని
స్కాలర్‌షిప్ నిలుపు చేసేసారు సార్
డబ్బు చాలా అవసరం హెల్ప్‌చేసి పెట్టండి సార్" అని
అభ్యర్థించిన ఆ కుర్రవాని కనులే
జ్ఞాపకం వస్తున్నాయి.

కాగితాలు, కంప్యూటర్లూ జీవితాల్లోకి
చూడలేవన్న విషయాన్ని ఎలా చెప్పగలిగానూ?

ఆ వీధిలో, ఆ గుడిసె ముందు నిలిచిపోయిన
ఆ ఆటోని చూసినప్పుడల్లా....
రంగువెలసీ, తుప్పు పట్టీ, గడ్డి మొలచీ శిథిలమౌతున్న
ఆ ఆటోని చూసినప్పుడల్లా.....

చాన్నాళ్ళ తరువాత ఆటో నడుపుతూ కనిపించిన వాడు

"దేవుని కృప వల్ల అంతో ఇంతో సంపాదిస్తున్నాను కదా,
నువ్వింక రిక్షా తొక్కడం మానేయమంటే వినటం లేదు సార్ మా నాన్న"
అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి.

క్లాస్ రూమ్స్ లో ఎప్పటికీ నేర్వలేని పాఠాలవి.
ఆ రోజు వాడెంత ముద్దొచ్చాడనీ!

యాక్సిడెంటులో నుజ్జు నుజ్జయిన వాడి ఆటో పక్కనే
కొత్తగా గ్రీజు పెట్టిన డొక్కు రిక్షాను చూసినప్పటి నుంచీ ....

ఎందుకో తెలియటం లేదు కానీ ....

జనవరి 24, 2011

నగరంలో చిరుత

జనావాసంలోకి చిరుత ప్రవేశించింది.
పాపం అది దారి తప్పి కాదు ఇటువస్తా.
తను పుట్టిన ప్రదేశాన్ని చూసుకొందామని వచ్చింది.
ఎటెళ్లాలో తెలియక ఓ ఇంటి బాత్ రూం లో దూరింది.

లక్షల విలువచేసే దాని మచ్చల చర్మం మెరుస్తోంది.
ఆ నిగారింపు తెలియకూడదని కామోసు
అది చీకటి మూలల్లోకి నక్కుతోంది.

తన ఒక్కో గోరు మూడేసి వేలని విన్నట్లుంది
గోళ్లనన్నీ లోనకు లాగేసుకొంది.

తన ఎముకలపొడి తులం వెయ్యి రూపాయిలని వినగానే
దానికి వెన్నులోంచి చలి మొదలైంది.
"రక్షించండి, రక్షించండీ" అని అరచింది దీనంగా.
జనాలు భయంతో పరుగులు తీసారు.

ఓ అత్యుత్సాహి దానికి "కొంచెం" దగ్గరగా నుంచొని
సెపియా టోన్ లో ఫొటోలు తీయించుకొంటున్నాడు.

మీడియావాడొకడు " ఎక్స్ క్లూసివ్ కవరేజ్" కోసమని
దానిని కర్రతో పొడిచి కెమేరా ఆన్ చేసాడు.
ఆ హడావిడిలో బాత్ రూం తలుపు గడియ ఊడింది.
ఒక ఉరుకులో అది బయటపడి
ఇక వెనక్కు తిరిగి చూడకుండా పరిగెట్టింది.
మానవ మృగాలకు దూరంగా ... చెట్లు నరికిన అడవి వైపు.

ఫిబ్రవరి 26, 2011

కవిత్వం

ఆమె వచ్చి కూర్చొంది
ఇద్దరి మధ్యా నిశ్శబ్దం
రివ్వున వీస్తోంది

ఎక్కడి నుంచైతే నా భవిష్యత్తుని
ప్రారంభించానో ఆ పెదవులు
సన్నగా కంపిస్తున్నాయి

కానీ
ఆ నాటి కరుణ స్పందన కాదిది

ఇరువురి మౌనం
ఆ క్షణాల్ని కోసుకొంటూ సాగుతోంది
నదిని చీల్చుకొంటూ సాగే నావలా

హృదయ వేదికపై
మృత జ్ఞాపకాల
కరాళ నృత్యం

శకలాల్ని ఒక్కొక్కటీ
ఏరుకొంటున్నాను

జారిపోతున్న చీకటినంతా
కూడదీసుకొని
"ఇక వెళ్తాను" అని లేచింది
"వెళ్ళొస్తాను" అను
"వస్తే....... వెళుతున్నానుగా!" అంది
నా నిస్సహాయ చూపుల్ని
విడిపించుకొని
ఆమె వెళిపోయింది
....

పునర్జన్మించాల్సినంత
జీవన కాంక్ష
ఎంతకీ కలగట్లేదు
ఇక శలవ్!

సెప్టెంబరు *12, 2011*

ఎంతదృష్టం......

ఎంతదృష్టం!
కనులున్నాయి
కనులు కనే
కలలున్నాయి
కలలు ఆవిష్కరించే
హాయైన లోకాలున్నాయి
ఎంతదృష్టం!

గాయాల్ని
ఇముడ్చుకొనే
హృదయముంది
హృదయ గాయాల్ని
నయం చేసే
కాలం ఉంది
కాలాన్ని వేటాడే
జీవితం మిగిలే ఉంది
ఎంతదృష్టం!

అన్ని వైఫల్యాలనూ
అక్కున చేర్చుకొనే
ప్రకృతుంది

ప్రకృతి పొరల్లో
ప్రాణాన్ని గింజను చేసి
పాతిపెట్టే మృత్యువుంది
మృత్యు స్పర్శను
నిత్యం స్వప్నించే
కనులున్నాయి......
ఎంతదృష్టం!

లేకపోతేనా
ఇన్ని వైరుధ్యాలున్న లోకాన్ని
దాటటం ఎంత కష్టం!

సెప్టెంబరు *23, 2011*

అదే గులాబీ.....

చేతిలో రంగుల ఉత్తరం
గులాబీ పువ్వుతో
ఆ అబ్బాయి బస్సుకై
ఎదురుచూస్తున్నాడు

తను గుర్తుకొచ్చింది
ఒకనాటి
పూర్తికాని చుంబన పరిమళం
ఎదంతా పరచుకొంది

ఆ అబ్బాయి కళ్ళు
ఆగిన ప్రతి బస్సునీ
వెతుకుతున్నాయ్.

అతను అచ్చునాకులానే
ఉన్నాడనిపించింది
అవే కళ్ళు ...
అవే చూపులు ...
అదే గులాబీ ...

ఏమో నేనే
ఆ అబ్బాయినేమో!

ఆ అబ్బాయే
నేనేమో!

మరోసారి తడుముకొన్నాను
జెబులోని
గులాబీ రేకల గరగరల్ని

సెప్టెంబరు 30, 2011

దేహమూ – నీడా

సూర్యుని
వేడి రక్తపు చుక్కలు
నెర్రలు తీసిన భూమి చర్మం

చలి చీకటి తాగి
మెరుస్తూన్న
ఆకాశపుటిరుకు సందులు

గోడ గడియారం
మసిలో కూరుకుపోయింది

ఎంతవెతికినా
పురుగు చిక్కదు
వేకువ పక్షికి

పంజరం
పరిశుభ్రంగానే ఉంది కానీ
గుండెనిండా
లుకలుక లాడే మురికికూపం.

దేహం కన్నా
నీడే తెలివిగా ఉంది
ఈ బూడిద లోకాన్ని
నిత్యం సందేహిస్తుంది

రుధిర క్షణాలు
చలి శ్వాసకు గడ్డ కట్టాయి
అంతా నిశ్శబ్దం
లోకం నిద్దరోతుంది
దేహాన్ని నీడ ఎత్తుకుపోయి
మృతుల దేశంలో దించేసింది

ఆ తరువాత.........

అక్టోబరు 9, 2011

మధ్యాహ్నపు నిదురలో ఓ స్వప్నం

ఎడారిలో నడుస్తున్నాను
కనుచూపు మేర చుట్టూ ఇసక
దాహంతో గొంతు మండిపోతూంది
ధూళిపడి కనులు మెరుగుతున్నాయి
గాలి వేడికి శ్వాస ఉక్కిరిబిక్కిరౌతూంది

దూరంగా
ఆకుపచ్చని దుస్తులు ధరించిన ఆమె
నా వేపు చేతులు చాచి
తన కౌగిలిలోకి ఆహ్వానిస్తోంది

ఆమెనుంచి వస్తూన్న అత్తరు వాసన దారిలో
దాహాన్ని ఓర్చుకొంటూ
వేడిని చీల్చుకొంటూ
బాధను అణుచుకొంటూ
కాల్చే ఇసుకలో నడుస్తున్నాను
పరిగెడుతున్నాను... తూలిపోతున్నాను

ఎంత పరిగెట్టినా
ఇద్దరిమధ్యదూరం తరగటం లేదు

అంతు లేని పరుగు ....
వేడి పరుగు ....
కాల్చే పరుగు ....
నెత్తుటి పరుగు.
****

చల్లని చేతి స్పర్శకు
హఠాత్తుగా మెలకువ వచ్చింది
ఎదురుగా ఆమె మోము
ఒక ఒయాసిస్‌లా

ఇంతసేపు ఆమె ఒడిలో
నిద్రిస్తూ కలకంటున్నానా!

ఎంతసేపటినుంచి
నా బరువుని మోస్తూందామె?

నవంబరు 15, 2011

దొరికిన దొంగ .....

కొబ్బరి కాయల దొంగ దొరికాడట
చెట్టుకు కట్టేసి కొడుతున్నారంటే
చూట్టానికి వెళ్ళాను.
అతను తల దించుకొని ఉన్నాడు
చీప్ లిక్కర్ వాసన గుప్పుమంటోంది.
వ్యసనం అతని ఆత్మను తినేసింది
ఆత్మలేని ఆ వికారదేహం
రక్త గడ్డలా ఉంది.
వాడి కుటుంబాన్ని తల్చుకొంటే జాలనిపిచింది.

వీధికొక్కటి చొప్పున
వెలిసిన గిలిటన్ల వేట్లకు
ఊర్లకు ఊర్లు కబేళాలుగా
మారుతున్న దృశ్యశకలమిది.

ఉన్నది కనుక తాగుతున్నారు
తాగుతున్నారు కనుక ఉంచుతున్నాం
నరంలేనిదే నాలుక కదా!

లిక్కర్ వైద్యం ఇన్సూరెన్స్ ఎక్స్‌గ్రేషియా అంటూ
ప్రాణం చుట్టూ అన్ని
వ్యాపారాలు ముడివేసుకొన్నపుడు
జీవితం ఎంత చవకో
అతణ్ణి చూస్తే అర్థమౌతుంది.

"ఇది వరకు తిండి కోసం దొంగతనాలు చేసేవారు
ఇప్పుడు మందుకోసం చేస్తున్నారు" ఎవరో పెద్దాయన
గొణుక్కొంటున్నాడు.

అభివృద్ధంటే అదేనేమో!

డిశెంబరు 23, 2011

జీవితం

ఎవరూ నడవని
దారి కదాని
ఉత్సాహంగా
ముందుకుపోతూంటే
జీవితం నవ్వుతో
"ఓయ్ పిచ్చిమొద్దూ
నేనిక్కడుంటే అటెక్కడికి
పోతున్నావ్? అంది
వెనుకనుంచి.

జనవరి 8, 2012

ఒంటరితనం

ఒక మధ్యాహ్నం
ఒంటరిగా సాగిపోతూంది
నేనూ ఒంటరిగానే గదిలో
స్వారీ చేసే మౌనంతో

ఒకే ఫాను
ఒకే కుర్చీ
ఒకే టేబులు
ఒకే నేను
నిశ్శబ్దంగా
మధ్యాహ్నంలోకి
ఒలికిపోయాం
ఇక అది మమ్మల్ని మోసుకొంటూ...

జనవరి 16, 2012

నువ్వు కాదు నేనే

స్వప్నానికి నాకూ మధ్య
మంచులా పరచుకొంటున్నది
నా శ్వాసా లేక నీదా?

ఎన్నెన్ని అస్ఫష్ట దృశ్యాలు!

నేలకొరిగిన తూనీగపై పూల వాన
అద్భుత సమాధి
చుంబించుకొన్న పెదాలు అదృశ్యమైనా
ఇప్పటికీ పరిమళించే ప్రేమలా

కొలను అలలపై
ఏటవాలు కాంతిపుంజం
సన్నగా ఒణుకుతోంది
నీ జ్ఞాపకాలపై నా హృదయంలా

నీవు పంపించే వసంతాలకు
ఎడారి దూరంలో నేను
నీకై నా ఆత్మ కోయిల పాడేపాట
నాకే చేదు చేదుగా అనిపిస్తోంది

తనమార్గాన్ని తానే అల్లుకొంటూ
సాగిపోతోంది కాలం సాలీడల్లే

ఒంటరితనం శూన్యమేమీ కాదు కానీ
తీవ్రమైన అలసట మాత్రం
చీకటిలా మెరుగుతూంటుంది

జ్ఞాపకాలు నాని ఉబ్బి
వికృతంగా తయారయ్యాయి
గాలినిండా మృత్యువాసన

నా కవితల్లో నువ్వంటే నువ్వు కాదు   నేనే

ఫిబ్రవరి 1, 2012

ఫ్రాగ్మెంట్స్

1.
వానచినుకూ
సాగర హృదయం
ఒకరిలోకి మరొకరు
కరిగిపోతూ మరలా
మిత్రులైపోయారు

2.
ఒకే ఒక్క రాగంతో
చిమ్మెట
తెల్లారేదాకా
సూర్యుడ్ని
పైకి లేవనియ్యలేదు

3.
అమావాస్య రాత్రి
చందమామ
శకలాలు శకలాలుగా
విడిపోయి
తిరుగుతోంది భువిపై
మిణుగురుల రూపంలో

4.
చికన్ కూర
అమ్మ వడ్డించింది

మెత్తని ముక్కలన్నీ
మాయమయ్యాయి

5.
ఆ కాన్సర్ పిలగాని
నవ్వు
కన్నీళ్ళ కన్నా
ఎక్కువ
బాధిస్తోంది

6.
స్వచ్ఛమైన
సెలయేరు
పొర్లుతూ దొర్లుతూ
నదిని చేరేసరికి
నిలువెల్లా
మురికి మురికి

7.
అందరూ
ఉత్తపేర్లేనట
అనాచ్ఛాదిత ఆత్మలు
బయటపడేలా
ఈ పేర్లను
బండకేసి తోమాలి

మూడు సంసారాలు...

కొట్టునుంచొచ్చిన భర్తకు
వడకట్టిన చెరువునీళ్ళను
దోసకాయ చెంబుతో ఇచ్చి
మామ్మ మేనత్తల జడలు
ముడివేసిన ఘనకార్యానికి
గంతులువేస్తున్న పిల్లలను వారించి
కుంపట్లోని చల్లారిన వంకాయతో
పచ్చిపులుసు చేయటానికి
వంటింట్లోకి వెళ్ళింది - నాయినమ్మ

పేపర్లు దిద్దుతున్న భర్తకు
స్టీలు ప్లేటుతో జంతికలు ఇచ్చి
ఎక్కడెక్కడో ఆట్లాడుకొని వచ్చిన పిల్లల్ని
కాళ్ళుకడుక్కొని పుస్తకాలు తియ్యమని చెప్పి,
స్టవ్ వెలిగించి టీ పెడుతూ
"రాత్రికి కూరేంచేయమంటారూ" అంది - అమ్మ

ఆఫీసు బడలికను విదిలించుకొని
పిల్లల రీడింగ్‌రూమ్ డోర్ దగ్గరకు వేసి
ఫ్రీజర్‌లోని కర్రీని ఓవెన్‌లో ఉంచి
డ్యూటీకి వెళ్ళేముందు నేపెట్టిఉంచిన

గ్రీన్ టీ ని ఫ్లాస్క్ నుంచి కప్‌లో ఒంపుకొని
సోఫాలో కూర్చొని తాగుతూ
రిమోట్‌తో టీవి ఆన్ చేసింది - నా భార్య

ఫిబ్రవరి 27, 2012

ఒక హిస్టరెక్టొమీ..

కారణాలేమైనా కానీ
నెలకో రక్తపుష్పాన్ని
రాల్చే
వృక్షాన్ని సమూలంగా
పెకలించారు.

నాగరీకుని
వైద్య ప్రయోగశాలలో
స్త్రీ దేహమెపుడూ ఓ గినియాపిగ్గే!

కారణాలేమైనా కానీ
రెండుకోతల్ని భరించి
ఒక తరాన్ని సృష్టించిన
మానవజాతి మొదటి ఊయల
మూడో కోతతో
మొదలు తెగి నేల కూలింది.

పర్యవసానాలు పూర్తిగా తెలీని వైద్యంలో
గర్భసంచో టెస్ట్ ట్యూబ్.
పిల్స్ సిజేరియన్లు ఐయుడీలు,
ఐపిల్స్ ఇదిగో ఇపుడు సర్రోగసీలు.

కారణాలేమైనా కానీ
కనిపించని కత్తెరేదో
ఏ కనపడని భాగాన్ని తొలగించిందో
ఆత్మ
పెళుసుబారి, నెర్రలుతీసి
మరుగుకోసం దేహం
అంతా తిరుగుతూ రోదిస్తోంది.

ఓదార్చటానికి
హెచ్.ఆర్.టీలు, యాంటిడిప్రెస్సెంట్స్
వెంటనే వాలిపోయాయి.

జరాయురహిత దేహమిపుడో
సజీవ టంకశాల కదా!

(విచ్చలవిడిగా జరుగుతున్న హిస్టరెక్టొమీ ఆపరేషన్లకు వ్యతిరేకంగా...)
(Hysterectomy : గర్భసంచి తొలగింపు – HRT: Hormone Replacement Therapy)

మార్చి 30, 2012

మూల్యాంకనం

జవాబు పత్రాన్ని పట్టుకోగానే
ఓ ఏడాది కాలాన్ని
చేతిలోకి తీసుకొన్నట్లుంటుంది.
ఏదో అపరిచిత జీవితాన్ని
తడుముతున్నట్లనిపిస్తుంది.

పాస్ మార్కులు వేయమంటూ
కన్నీటి ప్రార్థనో, వెయ్యినోటో, ఫోన్ నంబరో
లేక శాపాల బెదిరింపో వంటి చేష్టలు
బిత్తరపరచినా
ఇన్నేళ్ళ చదువులో ఎక్కడా తగలని
ఒక వాక్యమో, కొత్త కోణమో, వివరణో
తళుక్కుమన్నపుడు
కవిత్వం చదివినంత
ఆనందమౌతుంది.

జవాబు పత్రాల్ని మెదడు తూకం వేస్తే
హృదయం మూల్యాంకనం చేస్తుంది.

ఈ స్టూడెంట్ కి
మమ్మీ డాడీ దీబెట్టి బెస్టాఫ్ లక్ చెప్పారో లేదో
హైలైటర్స్, స్కెచ్‌పెన్ లు కొనివ్వలేదు కాబోలు
స్కేలు కూడా లేదేమో...
పేపరు మడతే మార్జినయ్యింది.

ఈ అక్షరాలు వ్రాసిన చేయి
పొలంపనులు చేసిందో, రాళ్ళు మోసిందో
పెట్రోలు కొట్టిందో లేక అంట్లే తోమిందో
అక్షరాల నిండా మట్టి వాసన ... మట్టి వాసన...
హృదయానికి మట్టివాసన ఎంతిష్టమో!
జవాబులు సరిగ్గా రాయకపోవటానికి కారణం
ఒక్క చదవకపోవటమేనా... లేక
ఆ సమయంలో జబ్బుచేసిందా?
ముందురోజు తండ్రికి తలకొరివి పెట్టాడా?
పెళ్ళిబట్టలలో నేరుగా పరీక్షహాలుకు వచ్చిందా?
సమస్యలనుంచి రేపు పారిపోవాలనుకొంటున్నాడా?
ఖాళీ జవాబు పత్రం ప్రశ్నల పత్రమౌతుంది

పేపర్లు దిద్దటం అంటే ఒక్కోసారి
పత్రికల్లో పతాక శీర్షికలవటం కూడా
ఆత్మహత్యగానో, అత్యుత్తమ రాంక్ అనో.

జులై 20, 2012

సమతుల్యత

కప్ప ధమనీ వ్యవస్థ డిసెక్షన్
విద్యార్థులకు డిమానుస్ట్రేషన్ క్లాసది.

క్లోరోఫాం ఇచ్చిన కప్పను
డిసెక్షన్ చెక్కపై ఉంచి
కదలకుండా కాళ్ళకు మేకులు కొట్టాను.

నా చుట్టూ విద్యార్థులు నిల్చుని
శ్రద్ధగా గమనిస్తున్నారు.
సిజర్‌తో చర్మాన్ని కొద్దికొద్దిగా తొలగిస్తూ
స్టెర్నమ్ ఎముకను కత్తిరించి
ఉరఃకుహరాన్ని బయల్పరిచాను.

"మీ చేతులు వణుకుతున్నాయి సార్"
అన్నాడో విద్యార్థి.

అప్పుడు గమనించాను
నా చేతులు విపరీతంగా వణుకుతున్నాయి.
మిగిలిన డిసెక్షన్ వెంటవెంటనే ముగించి
వచ్చేవారం మీరు చేద్దురుగాని అని చెప్పి
డిపార్ట్‌మెంటుకు వచ్చేసాను.

భయమేసింది జబ్బేదైనానా అని.
కాగితం తీసుకొని నా పేరు వ్రాసుకొన్నాను
ముత్యాల్లాంటి అక్షరాలు
కొంచెం ధైర్యం వచ్చింది.

****

విద్యార్థుల ఒక్కొక్కరి ట్రేలో ఒక్కో కప్ప
వాళ్ళు జాగ్రత్తగా డిసెక్షన్ మొదలుపెట్టారు.
కాసేపయ్యాకా చూద్దును కదా
ప్రతి ఒక్కరి చేతులూ వణుకుతున్నాయి

అలా వణుకుతున్న చేతులతోనే
అందరూ డిసెక్షన్ చేస్తున్నారు – ఆశ్చర్యంగా!

****

నిన్నరాత్రి
చెరువుగట్టుపై మిడతలు వాలినపుడు
గరికపూలు అలానే వణికుంటాయి

ఏప్రెల్ 24, 2013

ఊడుపు

పట్టె తోలిన వరిచేను
ఏది మబ్బు? ఏది కొంగ?

ఒంగున్న స్త్రీలు
వరిమొలకల్ని
అనంత నీలిమలో
గుచ్చుతున్నారు
ఏది మన్ను? ఏది మిన్ను?

జులై 18, 2013

స్వప్నమునందు నిదురించువారు ధన్యులు...

నాకూ నా అంతరాత్మకు
ఈ మధ్య అస్సలు పడటం లేదు
నే చేసే పనులపట్ల
వాడు చాలా కోపంగా ఉంటున్నాడు
అరిచి గోల చేస్తున్నాడు
నేనో హరిత పంజరంలో చిక్కుకొన్న
పక్షినని ఎంత చెప్పినా వినడు
"నాతో చెప్పద్దు, నీ ఇష్టం
వచ్చినట్లు చేసుకో" అంటో
చీదరించుకొంటాడు

ఆమె బేల చూపుల్ని విదిలించుకొని
వచ్చేసిన రోజయితే
వాడు తన బలమైన చేతులతో
నన్ను కుదిపేస్తూ
ఉక్కిరిబిక్కిరి చేసేసాడు

గడియారం టిక్కు టిక్కు మంటో
దగ్గుతున్నట్లుగా...

తెల్లని కంటిపాపపై
వెంట్రుకలు మొలిచినట్లుగా...
ప్రాణపాము తన బట్టల్ని విడిచి
ఎటో వెళిపోయినట్లుగా .... జీవితం

ఇలాగయితే సుఖం లేదని
ఓ రోజు గోదారి ఒడ్డుకు వెళ్ళి
వాడితో మాట్లాడటం మొదలుపెట్టాను
కాసేపటికి నా కళ్ళమ్మట నీళ్ళు
ఇద్దరం భోరు భోరున ఏడ్చుకొన్నాం

చాలాసేపు మౌనం తరువాత
"నువ్వు మాత్రం ఏం చేస్తావులే"
అని వాడు గొణుక్కోవటం వినిపించింది

జులై 29, 2013

ఒక జ్ఞాపకం ....

మొదటి సారి
కలిసిచూసిన సినిమా టిక్కెట్టు
నాది నావద్ద భద్రంగా ఉంది
తన వద్ద కూడా
ఉండి ఉంటుందా!

రాత్రి పొడవునా
చూపులు వర్షిస్తూనే ఉన్నాయి
స్వప్నం అంచుల చుట్టూ
ఆలోచనల చీమలు చేరి
కతుకుతున్నాయి.

చీకటి వేళ్ళు
హృదయంలో లోతుగా
పాతుకొంటున్నాయి.

స్వరపేటికపై వసంతాల్ని
నాట్యం చేయించిన పిట్ట
వర్షాన్నలా వింటూ ఉండిపోయి
నిలువెల్లా తడిచిపోయింది.

బిరబిరా పారుతున్న గాలికి
గజ గజ వణుకుతోంది.

ఛ..ఛ... మరచిపోవటం ఎలానో
జ్ఞాపకం ఉంచుకోకూడదు ఇకపై....

ఆగష్టు 7, 2013

కొన్ని పదాల గురించి......

ఏమీ గుర్తు లేవిపుడు
జేబుడు సూర్యకిరణాలు
గుప్పెడు చందమామ
ముక్కలు తప్ప.

దుఃఖాశ్రువులు నిండిన
సాయింత్రాన్ని
రాత్రి రెప్పల క్రింద
నిదురపుచ్చి అన్నీ
మరచిపోదామనుకొంటాను
కానీ
కొన్ని పదాలు నా నుండి రాలిపడి
ఓ ఎడారిని సృష్టిస్తాయి
ఆ ఎడారిలోంచి ఓ అరణ్యము
ఆ అరణ్యం లోంచి కుంభవృష్టీ
ఒక్కొక్కటిగా విచ్చుకొని
నన్ను కబళిస్తాయి.
నానుంచి పుట్టినదైనా
నన్నో పూచికపుల్లను చేసి
కొట్టుకొని పోతుంది

ఏమీ గుర్తులేవిపుడు
జేబుడు పదాలు
గుప్పెడు కలల
ముక్కలు తప్ప

ఆగష్టు 14, 2013

చర్మం రంగు

'ముఖ్య అతిధికి బొకే నేను ఇస్తాను టీచర్"
"నువ్వొద్దు ..... అందుకు వేరే వాళ్ళను ఎంపిక చేసాం"
ఆ 'వేరేవాళ్ళకు' తనకూ ఉన్న తేడా
ఆ అమ్మాయికి కాసేపటికి తెలిసింది
చర్మం రంగు.

చరిత్ర లోయలోకి
నెత్తురూ కన్నీళ్ళూ పారిస్తూ,
జీవన మార్గాలపై
చీకటివెలుగుల్ని శాసిస్తోన్న
చర్మం రంగు ..... చర్మం రంగు ....

సంచి కన్నా ఆత్మ గొప్పదని
వెర్రికేకలతో అరవాలనుకొంది ఆ అమ్మాయి.

ఉబ్బిన మొహం, ఎర్రని కళ్లతో
తనకొచ్చిన ప్రైజుల్ని తీసుకొని
మౌనంగా నిష్క్రమించింది.

పదేళ్ళ తరువాత .....
"ముఖ్య అతిధి" స్పీచ్ ముగించుకొని

వెళుతూ వెళుతూ
ఉబ్బిన మొహం, ఎర్రని కళ్ళతో ఉన్న
ఓ స్టూడెంట్ చేతిలో బొకే పెట్టి,
భుజం ఎందుకు తట్టిందో
ఎవరికీ అర్థం కాదు
మరో పదేళ్ళ దాకా

ఏప్రెల్ 16, 2014

విడిపోయింతరువాత........

బెల్లంపల్లి బొగ్గు పుప్పొడి
హన్మకొండ నూతి గుండె లోతూ
చొప్పదండి వాసుల బుష్ కోటు
ఆల్ఫాలో దమ్ బిర్యాని
హెడ్డాఫీసులో లెమన్ టీ .....
కొన్ని జ్ఞాపకాల్ని వదిలించుకోలేం
బుట్టలోని పాములా
బద్దకంగా మెదలుతూంటాయ్.

టాంక్ బండ్‌పై అతిశయంతో
అటూ ఇటూ తిరిగిన ఆంధ్రతేజాలు
గద్దరన్న పాట, కెసియార్ అన్నమాట
కాళోజీ, ఆశారాజు, అఫ్సర్,
స్కైబాబ, గోరటి వెంకన్నల జ్ఞాపకాల్ని
ఎలా చెరుపుకోవాలి?

అయినా
ఎందుకు చెరుపుకోవాలి?
నీ తప్పేముంది
నీకేంకావాలో ముందునించీ
స్పష్టంగానే చెపుతున్నావ్!

మాకే అర్థం కాలేదు
ఇంత జరిగేదాకా.

నీకూ ఏవో
జ్ఞాపకాలు ఉండే ఉంటాయిలే
చెప్పుకోవటం లేదు కానీ!
కొన్ని జ్ఞాపకాల్ని
చెరుపుకోవాలనుకొన్న కొద్దీ
నత్తగుల్ల మెలికల్లా
వెలుగులోకే తెరుచుకొంటాయి

పూల చుంబనాలలో
చెట్లు అమరత్వం పొందినట్లు
ఈ స్వప్నాలలోనే
జీవిస్తాను నేను.

ఏప్రెల్ 21, 2014

అతిశయం

అన్ని నిర్ణయాలు
ముందే అయిపోయాయి
ఏదో కాలక్షేపానికి
జీవించాలి అంతే!

పుట్టినపుడు
మతాన్ని బట్టి
గ్రహాలు పైకీ క్రిందకూ మారతాయి
కులాన్ని బట్టి
తారలు అటూ ఇటూ సర్దుకొంటాయి
కుటుంబాన్ని బట్టి
రాశిచక్రం రూపుదిద్దుకొంటుంది

కలహాలు, ప్రేమలు
పోటీలు, పథకాలు
అన్నీ మనది కాని
ఏదో ప్రణాళికలో భాగాలే!
ఆఖర్న మరణం కూడా.

అయినప్పటికీ
ఓ మొగ్గ విరిసినా

ఓ తుమ్మెద వాలినా
ఓ డొలక రాలినా
ఈ చెట్టుకెంత తహ తహ!
వెలుగుని బంధించామనుకొనే
ఈ పత్రాలదెంత అతిశయం!

అక్టోబరు 30, 2014

నీటిపొర

తాగుడు పై సదభిప్రాయం లేకపోయినా
దురభిప్రాయం మాత్రం ఉండేది కాదు
అదో పురాతన విలాసం కదాని

కానీ
మొన్నోరోజు మా కాలేజీలో
ఓ విద్యార్థిని తండ్రి తన కూతుర్ని
నలుగురెదుటా బూతులు తిడుతూ
అవమానించినపుడు
ఆమె కనుల నీటిపొరలో
తాగుబోతు తండ్రులందరూ
దగ్ధమైపోవాలనుకొన్నాను

"కొయిటా అమ్మ నా పేర్న పంపించే
డబ్బుల కోసమే ఇదంతా" అని ఆ అమ్మాయి అన్నప్పుడు
ఆ నీటిపొరలో ఈ మద్యప్రపంచం
కొట్టుకు పోవాలనుకొన్నాను

గత ఘర్షణల గాయాల్ని చూపించినపుడు
ఆ నీటిపొరలో ఈ మదపు నేల నిలువునా
కృంగి పోవాలనుకొన్నాను

సముద్రాన్నీదడానికి
పూచికపుల్లంత నమ్మకాన్ని తప్ప
ఏమివ్వగలిగాం? ఆరోజా అమ్మాయికి

****

మూడ్రోజుల తరువాత
ముత్యాల్లాంటి అక్షరాలతో ఎసైన్మెంట్
రాసుకొచ్చిన ఆ అమ్మాయి
కనుల నీటిపొరలో ఎన్నెన్ని సౌందర్యాలు !

నవంబరు 14, 2014

ప్రకృతి

వానపాములు తూనీగలు
తొండలు కప్పలు పిట్టలు
గుంటనక్కలు రాబందులు
ఒకదానికొకటి గోరుముద్దలు
తినిపించుకొనేవి.
అన్నింటినీ మింగేసి
మనిషి మనిషిని తింటున్నాడు.

పాపం! జగమేలే పరమాత్మ
ఎవరితో మొరపెట్టుకొంటుంది?

డిశెంబరు 26, 2014

ప్రశాంతత

కనుల లోతుల్లోకి
ఒక దృశ్యం
రాలి పగిలి
శకలాలై వర్షించింది

హృదయం
తన జలాల్ని
తానే పైకి లేపి
నౌకల్ని లోనికి
లాగేసుకొంది.

ప్రశాంతత
అనంత నీలిమలా.....

డిశెంబరు 21, 2014

నీకసలు స్వప్నించే అర్హత ఉందా.....

నా పెదవుల్ని
నీ పెదవుల మధ్యకు తీసుకొని
ఒక గాఢ చుంబనం
నా చేతులు నీ భుజాల్ని
గట్టిగా పట్టుకొన్నాయి.
మూసుకొన్న కనుల వెనుక......

రాత్రిరోడ్డుపై నల్లని ప్రయాణం
వానల్ని మింగిన వాగు గలగలలు
చల్లని గాలులతో శ్వాసిస్తోన్న తరువులు
బొట్లుబొట్లుగా అరుస్తోన్న నిద్రరాని పిట్ట
చలిగాలికి స్వరం పెంచిన కొలను కప్ప
మీదపడి మరణించిన సాయింత్రాన్ని
మోసుకు సాగే హృదయం.
విరిగిన కిరణాలతో ఉదయించింది
అదే సూరీడా లేక వేరే సూర్యుడా?
స్పర్శలోంచి సుఖం ప్రవహించినట్లుగా
దుఃఖస్వప్నం లోంచి స్మృతులు
సీతాకోకచిలుకలై పైకెగురుతాయి.

"నీకసలు స్వప్నించే అర్హత ఉందా"
అనడిగావు కదూ!

నిన్నూ నన్నూ
ప్రేమలోనో క్షమలోనో
కలుపుతున్నవి ఈ స్వప్నాలే కదా!
నేను స్వప్నిస్తున్నాను కనుకనే
నువ్వొచ్చి వెళిపోతున్న విషయం
పదే పదే గుర్తుకొస్తోంది.

జనవరి 4, 2015

ఫ్రాగ్మెంట్స్

1.
రాలిన పత్రాల్ని
లోనికి లాగేసుకొని
పూవులుగా అందిస్తాయి
తరువులు

2.
ఏమివ్వాలో తెలీక
రెండు పక్కటెముకల్ని
అక్కడ పెట్టి
నిశ్శబ్దంగా
వచ్చేసాను

3.
హింసించే ఈ బరువుల్ని
వదిలించుకొని
భారరహితమౌదామా?
చూడు
ఆ సీతాకోకచిలుక
ఎంత తేలికగా
ఎగురుతోందో!

4.
నిత్యం నీ స్వప్నాలలో
నీతో సంభాషించే అమ్మాయి
ఈరోజు నా కల్లోకి వచ్చి
ముద్దిచ్చిన విషయం
నువ్వేనాటికీ స్వప్నించలేవు

5.
ఒక సంఘటన
ముక్కలు ముక్కలుగా
వెదజల్లబడింది
ఎవరి శకలం వారిదే.

వీడికి ఏనుగు తోక
దొరికినట్టుంది
భలే వాదిస్తున్నాడు.

జనవరి 7, 2015

ఇల్లు

ఇంటికెళ్లటం ఒక వ్యసనం
LSD ట్రిప్ కోసం పక్షులన్నీ
సాయింత్రానికల్లా
ఠంచనుగా గూళ్లకు చేరుకొంటాయి.

ఇంటికెళ్లలేకపోవటం ఒక విషాదం
పెద్దపులిని
నమ్మించలేకపోయిన ఆవు కోసం
లేగదూడ జీవితాంతం
అరుస్తూంటుంది.

జనవరి 13, 2015

అల్పత్వము

కోయిల గొంతులో రక్తజీర
జాతిని నిలుపుకోవటానికి
ఇదే చివరి పిలుపన్నట్లు.

పచ్చదనంతో పోటెత్తిన పత్రాలు
సూర్యుడ్ని పీల్చుకొంటాయి
రేపుండదన్నట్లు.

పువ్వులన్నీ పోటీపడతాయి
తుమ్మెద చుంబనానికై
ఈ రోజే ఆఖరన్నట్లు.

గాలిపటం వెనుక ఆ పిలగాడు
వడివడిగా పరుగెడతాడు
అదే ఈ లోకపు చివరిదైనట్లు.

చేతికందే ప్రతీక్షణమూ
కాలం అల్పత్వాన్ని
గుర్తుచేస్తూంటుంది.

జనవరి 21, 2015

మరణం

మీదపడి రక్కే సమయాల్ని
ఓపికగా విదిలించుకొంటూ
తోడేళ్ళు సంచరించే గాలిని
ఒడుపుగా తప్పించుకొంటూ
బాట పొడవునా
పరచుకొన్న పీడకలల్ని
జాగ్రత్తగా దాటుకొంటూ
శీతలమేఘాలు చిమ్మే కన్నీళ్ళలో
మట్టిపెళ్ళై చిట్లీ, పొట్లీ
మళ్ళీ మళ్ళీ మొలకెత్తుతూ
చివరకు చేరుకొన్నావా!

నీకోసమే పుట్టిన
నక్షత్రాన్ని తెంపుకొని
తురాయిలో తురుముకొని
గులాబిరేకలు, మిణుగురుపిట్టలు
నిండిన విజయంలోకి
చేరుకొన్నావా మిత్రమా!
అభినందనలు.

జూన్ 3, 2015

వీలుకాదని చెప్పించకు....

నీ దేహమొక స్వప్నం
ప్రతీరోజూ ఆ స్వప్నంలోకి
అనేకానేక అనుభూతులు
వచ్చిపోతూంటాయి

ఎరుపు తెలుపు
నీలిమ ఆకుపచ్చ ఎన్నో..
ఏనాడూ దేనినీ
అనాదరించకు.
ఆహ్వానించు అన్నింటినీ
నీ దేహంలోకి

ఎందుకంటే
అవి నీ గురించే పంపబడ్డాయి
నిన్ను
సంపూర్ణుడిని చేసి
ఓ స్వప్న వర్ణచిత్రంగా
మార్చటానికే
వస్తున్నాయి.

జూన్ 7, 2015

రెండు చింతలు

భుజాలపై చేతులువేసుకొని
నిలుచున్న మిత్రుల్లా ఉండేవి
ఆ రెండు చింతచెట్లు.

నాలుగు తరాల్ని చూసుంటాయి
చివరకు రియల్ఎస్టేట్ రంపానికి
కట్టెలు కట్టెలుగా చిట్లిపోయాయి.
వేళ్ల పేగులు తెంపుకొని
రెండు చింతలు నేలకొరిగాయి.

వృక్షం నేలకూలితే పిట్టలు
కకావికలం అయినట్లు
హృదయం చుట్టూ చింతనలు

చిత్రంగా జీవితానికి కూడా
నిత్యం రెండు చింతలు
గతము, భవిష్యత్తూ.
వర్తమాన రంపం
పరాపరా కోస్తూంటుంది.

(నే నడచిన దారిలో నీడనిచ్చిన రెండు చింతచెట్ల జ్ఞాపకాలతో)

జూన్ 26, 2015

అమ్మ

లేత చర్మాన్ని చుట్టిన గుడ్డల్ని
పచ్చిబాలింత బహుజాగ్రత్తగా
మారుస్తున్నపుడు.....

అంచులదాకా చీకటి నిండిన రాత్రి
ఎక్కడెక్కడి వెలుగురేకల్నో ఏరుకొచ్చి
నిదురలో నవ్వుతున్న పాపాయి పెదవులపై
ఒక్కొక్కటిగా పేర్చింది

ఆకుల సవ్వడి, పిట్టపాట
అలల గలగల, ఆకాశపు నిశ్శబ్దం
దేహాల చావులేమి.....

అన్నిమాటలెందుకూ
ఆ క్షణం నుంచే
భూమి తిరగటం మొదలైంది

ఆగష్టు *19, 2015*

అనావృష్టి

పిట్టనోట్లో రెండు బొట్లు
ఆకుల నాలుకలపై
నాలుగు తుంపర్లు
విదిల్చిన మేఘాలు
కొండమలుపులో
అదృశ్యమయ్యాయి.

రెండు ఉతుకులకే
రంగువెలసిన వస్త్రంలా
ఆకాశం మిగిలిపోయింది.

సెప్టెంబరు *23, 2015*

వెచ్చని కన్నీరు

జ్ఞాపకం ఒక చీకటి రాత్రి
వెలుతురు దుస్తులు తీసేసిన పగల్లాంటి
చిక్కని చీకటి రాత్రి జ్ఞాపకం

ఏం చూసావో నీకు గుర్తుండదు
ఇసుకపై బజ్జున్న పసి పిల్లాడ్నో లేక
చెట్టుకొమ్మకు వేలాడుతున్న పిడికెడు మట్టినో
కానీ దాని జ్ఞాపకం మాత్రం
చీకటి రాత్రిలా నీలో విచ్చుకొంటుంది.
లోహ శబ్దాలు నిండిన మెలకువ
నిశ్శబ్దంగా పరచుకొంటుంది నీ చుట్టూ.

చరిత్ర నదిలో వెచ్చని కన్నీరు
ప్రవహించే సందర్భమది.

సెప్టెంబరు *23, 2015*

దాహం

భూమిలోంచి పైకి లేచిన కుళాయి గొట్టం
ఒంపు తిరిగి పిట్టగోడను అనుసరిస్తూ సాగి
మరో రెండు మలుపులు తీస్కొని
ఇత్తడి టాప్ నేత్రమై
ఏ మేఘసందేశాన్నో నీళ్ళ భాషలో అందిస్తుంది

పుస్తకమూ అంతే
ఎన్నో మలుపులు తీసుకొని చేతిలోకి చేరి
ఒకనాటి మనో ఆకాశపు వానచినుకుల్ని
అక్షరాలుగా వర్షింపచేస్తుంది
మట్టి నయనాలపై

డిశెంబరు 17, 2015

ఆదిమ వాక్యం

ఒక్కో వాక్యం
రకరకాల దారుల్లోకి చీలిపోతుంది
ఏమో
తానే ఓ దారిగా మారొచ్చు కూడా!

కాలం గడుస్తున్నకొద్దీ
నేను నడవని దారులు
వాటిపై వేరెవరో ప్రయాణించిన
ప్రయాణాలూ
ఒక్కొక్కటిగా మీదపడతాయి.

వాటి భారాన్ని మోసుకొంటూ
తిరగగలనా అనుకొంటాను.
సహానుభూతిని మించిన
సౌందర్యమూ, సంతృప్తి
ఎక్కడ దొరుకుతుందీ?

కండ్ల కలకలూ, కలరాలు
ప్రేమకు పరీక్షపెట్టినట్టు
ఒక్కోసారి రకరకాల దారుల్ని
అర్థం చేసుకొనే అన్వేషణలో

నన్ను నేను కోల్పోతాను
ముక్కలు ముక్కలుగా
పగిలిపోతాను, వీగిపోతాను.
ముక్కలన్నీ కూడదీసుకొన్నాక
అర్ధమౌతుంది
ఇప్పుడు
నేనే ఓ దారిగా మారిపోయానని

ఎంత కాదనుకొన్నా
మనుషులందరిలో ప్రవహించే
ఆదిమవాక్యం ఒక్కటే కదా!

నాకు అర్ధం కాదు ......

నా బాల్యాన్ని ఆక్రమించిన
ఆ పాత రేడియో అంటే నాకెంతో ఇష్టం.
రోజుకోసారి దానిని తాకనిదే
ఆ రోజు గడిచినట్లుండదు.
అది మూగవోయి చాన్నాళ్లే అయినా
నిత్యందాని దుమ్ము దులిపి
ధగ ధగా మెరిసిపోయేలా చేస్తూంటాను.

"కాలం ముందుకుపోతూంటే మీరింకా
ఆ పాతని ఎందుకు పట్టుకు వేలాడతారూ?"
అంటుంది మా ఆవిడ ప్రతీసారీ

ఓరోజు ఇంటికి పెద్ద అతిథులొస్తున్నారని
మా ఆవిడ దాన్ని అటకెక్కించేసింది.
అతిథులెళిపోయాకా ఆ రాత్రి
అటకమీంచి దాన్ని దింపి
మరలా దుమ్ము దులిపి
నా టేబుల్ పై ఉంచుకొన్నాను.

నాకర్ధం కాదసలు
బాల్యానికి పాతేమిటి, కొత్తేమిటీ?

సెప్టెంబరు *10, 2009*

ప్రేమలేఖ

అమ్మా
పెళ్ళికిముందు నువు నాన్నకు వ్రాసిన ఉత్తరం
భలేగా ఉందే అంటోంది మా అమ్మాయి
ఆశ్చర్యంగా చూస్తూ.

ఏయ్! అది నీకెక్కడ దొరికిందీ?
ఉత్తరాన్ని గబగబా లాగేసుకొంది మా ఆవిడ.

అవును మరి
బట్టలు ఉతికి ఉతికీ
కారేజీలు సర్ది సర్దీ
చీరకట్టుకొన్న కారేజీలా
మారిపోయిన అమ్మే తెలుసు వీళ్ళకు.

అయినా
ఆ ఉత్తరంలో ఏం కనిపిస్తాయి వీళ్ళకు
గుప్పెడు మల్లెలు
ఇదిగో ఇలాంటి సందర్భంకోసం
కన్న ఏవో కొన్ని కలలు తప్ప.

కానీ
ఆ అక్షరాల మధ్య ....
సగం చెక్కిన శిల్పాన్ని
పూర్తిచేస్తానని ఇచ్చిన మాట
దినాంతాన
నన్ను పడవలో జాగ్రత్తగా పడుకోబెట్టి
పడవనడిపే వానికి
రెండు బంగారునాణేలు ఇచ్చి
భద్రంగా దాటించమని చెప్తానని
చేసిన ప్రమాణమూ
నాకు తప్ప మరెవ్వరికీ
కనిపించవు.

ఆగష్టు 25, 2015

అధికారం

వెయ్యి ప్రమాణాలు
భంగమయ్యాక కానీ
అర్థం కాదు నీకైనా నాకైనా
జయాపజయాలకు
అతీతంగా
యుద్ధం చేయాల్సిన
చెస్సు పిక్కలమని

ఇంతోటి వైభోగానికే
రాజు-బంటు తేడాలొకటీ

ఫిబ్రవరి 21, 2016

రక్తం మరకలు...

వాడు
మైకు ముందు
ఏవేవో ప్రణాళికల
చిట్టా విప్పాడు

జయజయధ్వానాలు
మిన్నంటాయి

ఎవరో నా చేతిలో
పూల రేకలు పెట్టారు
వాడు వేసే
అడుగు అడుక్కీ
పూల రేకలు చల్లాను

ఇంటికొచ్చి చూసుకొంటే
నా చేతుల నిండా రక్తం

ఎంత కడిగినా పోని
రక్తం మరకలు
రేపు నా పిల్లలకు
ఈ చేతుల్నెలా
చూపించేదీ?

ఫిబ్రవరి 16, 2016

అపుత్రస్య.......

నీకు సమ్మతమే కదా?
“సమ్మతమే”
గర్భసంచి గోడలపై
రూపుదిద్దుకొంటున్న
వాక్యం అసంపూర్ణంగా
తెగిపోయింది.
నీకు సమ్మతమే కదా?
తలదించుకొందామె.
కుడ్యచిత్రం పూర్తికాకుండానే
వాననీటికి రంగులు రంగులుగా
కరిగిపోయింది మట్టిలోకి.

ఆమెనెందుకు తీసుకురాలేదూ?
“ప్లీజ్”
రక్తనాళాల్లోకి దొంగలా ప్రవేశించిన
అబార్షన్ పిల్
గోడపై విచ్చుకొంటున్న
చామంతి మొగ్గను
చిదిమేసింది.

****

“వంశక్షయం కాకుండా
పండంటి మగబిడ్డను పొంది
స్వర్గార్హతను సాధించిన
నువ్వెంతటి అదృష్టవంతుడవయ్యా”
అని అందరూ అంటూంటే
హత్యచేయబడ్డ మూడు అసంపూర్ణ భ్రూణాలు
తలలు అడ్డంగా ఊపాయి.

జనవరి 1, 2016

ఇంటికి తీసుకెళ్ళవా?

హరప్పా పురవీధిలో నడుస్తూ
వెనక్కు తిరిగి నన్ను చూసి
నవ్విన సుందరికి
కాలాతీత కొనసాగింపు నీవు

అంత:పుర రహస్యమార్గం నిర్మించాకా
అదృశ్యం చేయబడ్డ ఆచారి విసిరిన
అలౌకిక దేహ రేణువును నేను

నిప్పుల మధ్య
నల్లని బొగ్గు అంచులతో
సగం కాలిన మన కలలు
రాతి పొరల మధ్య శిలాజాలు.

ఏ మాత్రమూ భరించలేని నిరీక్షణ
ఈ రక్త శ్వాస.

మట్టిని వెతుక్కొంటోంది విత్తనం

నన్ను ఇంటికి తీసుకెళ్ళవా?

ఫిబ్రవరి 21, 2016

ఆ తరువాతేం జరిగిందంటే.....

తెల్లని కాంతులీనే కొంగొకటి
ఓ ఊరి చెరువుగట్టుపై వాలింది
గొప్ప తేజస్సుతో, రాజసంతో ప్రకాశిస్తోన్న
దాని చుట్టూ ఊరి కొంగలు చేరాయి.

'ఎక్కడనుంచి వచ్చావు నీవు?'
'హిమాలయాలలోని మానససరోవరం నుంచి'
'మీ ఊరి విశేషాలు చెప్పు'

'సమీపాన రజతకాంతుల కైలాసశిఖరం
పవిత్ర జలాలతో నిండిన సరోవరం
దేవతలు స్నానించే నెలవు
ఒడ్డున కొలువుదీరిన కల్పవృక్షం
దివ్యకొలనునిండా స్వర్ణ పద్మాలు, మంచి ముత్యాలు'

'మరి నత్తలు... నత్తలుంటాయా మీ ఊరి చెరువులో'
'నత్తలు అంటే?'
'నత్తలంటే తెలియదా.... హవ్వ...'
అంటూ పకపకా నవ్వుకొంటూ ఎగిరిపోయాయి ఊరికొంగలు

కొన్నాళ్లకు
అమృతజలాలు లభించక
నత్తల్నెలా పగలగొట్టుకొని తినాలో తెలియక
మానససరోవరపు కొంగ కృశించి కృశించి
ఆ చెరువు గట్టునే చచ్చిపోయింది.

ఏప్రిల్ 15, 2016

రెండు నాల్కల పద్యం

ఆధునిక ప్రపంచానికి
నువ్వెవరో అనవసరం
నువ్వేం మాట్లాడుతున్నావు' అనేదే
ముఖ్యం
జేజేలు కొడితే మెచ్చుకోళ్లు
డౌన్ డౌన్ అంటే ఇక్కట్లు

నువ్వు కేవలం ఒక సంఖ్యవు అంతే!

****

ఆధునిక ప్రపంచానికి
నువ్వేం మాట్లాడుతున్నావో అనవసరం
నువ్వెవరో తెలిసితీరాలి
కులం మతం ప్రాంతం తోకలతో

నువ్వు ఉత్త విభజన రేఖవు అంతే!

ఏప్రిల్ 25, 2016

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు
రచనలు	**యానాం విమోచనోద్యమం** (2007) **ఆకుపచ్చని తడిగీతం** (2009) కవితా సంపుటి) **ఫ్రెంచిపాలనలో యానం** (2012) **స్వేచ్ఛావిహంగాలు** (రవీంద్రుని స్ట్రే బర్డ్స్ అనువాదం) 2016
ఇ.బుక్స్	**'ఎడారి అత్తరులు'** (ప్రముఖ సూఫీకవుల గీతాల అనువాదాలు) **ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం** (Twenty Love Poems and a Song of Despair, Pablo Neruda , తెలుగులో) **గాథాసప్తశతి-కొన్ని అనువాదాలు** (నాకు నచ్చిన కొన్ని గాథల అనువాదం) **వివిధ పుస్తకాల పరిచయ వ్యాసాలు** (పై ఇ.బుక్కు లభించు వెబ్ చిరునామా: http://www.scribd.com/bollojubaba)
బ్లాగు	http://sahitheeyanam.blogspot.com/
అవార్డులు	ఆకుపచ్చని తడిగీతం పుస్తకానికి శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం -2010 కళాలయ సాంస్కృతిక సంస్థ, పాలకొల్లు వారిచే సాహితీపురస్కారం 2012

Veluthuru Thera
Poetry

-Bolloju Baba

వచనం నుంచి కవిత్వాన్ని వేరు చేసేది 'ధ్వని' మాత్రమే. Suggestion కి అంత్యంత ప్రాధాన్యత. పద్యం చదవటం ముగిసిన తర్వాత - 'ఎంత బాగా అన్నాడు, ఎంత బాగా ఊహించాడు- ఊహించిన దాన్ని ఎలా దృశ్యమానం చేశాడు - అదెలా మన అనుభవం చేశాడు - మన అనుభవం - కవిత్వానుభవంగా మారి అంచుల దాకా చేరి పొంగిపొర్లుతుంది - ఒక ఆహ్లాదం ఒక సంతృప్తి - కొత్త దాన్నేదో అందుకొని అనుభవించిన తృప్తి - లోలోపల కాంతిగా పరిణమిల్లుతుంది - అంతా వెలుగే......

బొల్లోజు బాబా కవిత్వాన్ని గొప్పగా ఆనందించా, అనుభవించా
అతనొక తేనెపిట్ట- తేనెపిట్ట పువ్వుమీద వాలకుండా గాల్లో తేలుతూ
తేనె పీల్చటం ఎంతగొప్ప విద్యో - ఆ దృశ్యం ఒక అనుభవం
ఆ అనుభవాన్ని నాకిచ్చిన బాబాకి ధన్యవాదాలు

- కె.శివారెడ్డి